# పాస్టర్ ఏసుపాదం

కోరుకొండలో ఎనిమిదోక్లాసు చదువుకున్న వజ్జారపు కేశవ చదువు మధ్యలో ఆపేసి డ్రైవింగ్ నేర్చుకుని రాజమండ్రిలో ఉండే దయానందరావు దగ్గర డ్రైవర్‌గా చేరిపోయాడు.

జిల్లాలో ఉన్న హెడ్ క్వార్టర్స్‌కీ బ్రాంచీలకీ తిరుగుతా లూదరన్ చర్చిల్లో వచ్చే దశమభాగాల్ని వేలం వేస్తే వచ్చే ఆదాయాన్ని, ఇతరత్రా వచ్చే కాసుల మీద ఎకౌంట్స్ వేయించి సి.ఆర్. ఉజ్జోగం దయానందరావుది. అతని పద్ధతులూ, అలవాట్లకి తగ్గట్టు అన్ని ఏర్పాట్లూ చేస్తూ అతని దగ్గర చాలా నేర్చుకున్నాడు కేశవ. ముఖ్యంగా...బైబిల్లో రాసిన దశమభాగం గురించి విన్నాడు దాని మీద ——

నీధనము,

నీ ఘనము ప్రభు యేసుదే-

నీ దశమభాగమ్మునియ్య వెనువీతువా,

అనే కీర్తన విని రాత్రీ పగలనక పాడ్డం ప్రాక్టీసు చేసేడు.

దశమభాగము-

దేవుని సొమ్ము, ధారలముగ-

ఆయనకిమ్ము దీనించు నూరంతలుగా ఫలియించె-

ద్రాక్షావల్లిగా,

అనే ఇంకో కీర్తన కూడా పొద్దం నేర్చుకున్నాడు. దయానందరావు దగ్గర. అదిగాకుండా ప్రథమఫలం అని ఇంకోటుంది దాని గురించి కూడా బాగా విన్నాకా వాటన్నిటినీ బాగా అర్థం చేసుకున్నాకా, జీర్ణం చేసుకున్నాకా కొన్నాళ్ళపాటు బాగా ఆలోచించుకున్న కేశవ దయానందరావు దగ్గర డ్రైవరు ఉజ్జోగానికి పెద్ద నమస్కారం పెట్టేసేడు.

మతం మార్చుకున్నాడు. ఏసుపాదం అని కూడా పేరు మార్చుకున్నాడు. పాస్టర్లు వేసుకునే మోకాళ్ళు దిగిపోయేంత పొడుగాటి తెల్లగౌన్లూ, తెల్లపంట్లాం, నిగనిగలాడే నల్లబూట్లు వేసుకోడం మొదలెట్టేక మనిషిని గుర్తు పట్టడమే కష్టమైపోయింది.

* * *


వర్షం వచ్చేలాగుంది. పొద్దుట్నుంచీ ఒకటే గాలి.


రొట్టీ బిస్కట్లు సైకిలోడు డబ్బామూత మోగించుకుని అరుస్తా వెళ్తున్నాడు ఊళ్ళోకి. గుంపులు గుంపులుగా ఉన్న ఆవుల్నీ గేదెల్నీ కాల్వవేపు తోలు కెళ్తున్నారు పాలేరు కుర్రగాళ్ళు. కాలవగట్టు దగ్గర నిలబడ్డ జనం బలభద్రపురం మీంచెళ్ళే బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. రాత్రి పెళ్ళయిన మాపేటలో పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ నిన్నెప్పుడో చెంపలకి రాసుకున్న గంధంతో నలిగిన ఆ తెల్లబట్టల్తో ఉంది. నల్ల కళ్ళద్దాలెట్టుకున్న పెళ్ళికొడుకయితే భలేగున్నాడు. వాళ్ళిద్దరూ రిక్షాలో వెళ్తున్నారు. బులిరెడ్డి మేష్టారూ, శర్మా మేష్టారూ మాటాడ్తూ కాలవ గట్టెక్కుతున్నారు. అప్పుడే ఆగిన రాజమండ్రి బస్సు దిగి ఊళ్ళోకొస్తున్న ఆ మనిషెవరా అని తేరపార చూస్తే..ఏసుపాదం.

వెలగల పుష్పావతక్కగారి సీతకి మూడువారాల్నుంచి జ్వరమట ఏమందేసినా తగ్గటం లేదట ఆ ముక్క కొమరిపాలెం నించి వచ్చిన వాళ్ళ పుట్టింటోళ్ళ మనిషికి పుష్పావతక్క చెపుతుంటే గుమ్మం ముందు నించెళ్తున్న ఏసుపాదం టకాల్మని ఆగి ''ఎవరికమ్మా జ్వరం అంటున్నారు?'' అన్నాడు.

చెప్పింది పుష్పావతక్క.

'నేను యేసుబాబు పంపిస్తే వచ్చిన మనిషిని...మేమంతా మీకోసం ఉన్నాం. మీ బాధల్ని ప్రభువు తరపున నయం చెయ్యడానికున్నాం. ఒక్కసారి నేను లోపలికొచ్చి రోగికి ప్రార్థన చెయ్యొచ్చా?''అడిగేడు.





ఈ మనిషనేదేంటో అర్థంగావటం లేదు అనుకుంటానే "రండి" అంది పుష్పావతక్క.

లోపలికొచ్చి మంచం మీద పడున్న సీత పక్కన కాళ్ళు మడిచి కూర్చుని ఒక అరగంటసేపు పార్థన చేశాడు.

మర్నాడొచ్చి మళ్ళీ చేశాడు.

ఇలా వారంరోజులు చెయ్యగా అదేంటో విచిత్రం ఏ మందేసినా తగ్గని సీత జొరం కొంచెం తగ్గు ముఖం పట్టింది.

దాంతో పుష్పావతక్క వాళ్ళకీ నమ్మకం కలిగి "ఆ దేవుడే పంపించేడు బాబూ తమర్ని" అన్నారు.

"అవునమ్మా నేను ప్రభువు పంపితేనే వచ్చినాను ఏసుప్రభువు అందరికీ ప్రభువు" అన్నాడు.

అప్పట్నించీ ఆ వీధిలోంచి ఏసుపాదం వెళ్తుంటే దణ్ణం పెట్టి మర్యాదగా లోపలకి పిల్చి ఏ ఉప్పుడు పిండో, తేనెపాణకం వేసిన దిబ్బరొట్టిముక్కో కంచు గ్లాసుడు మజ్జిగో ఇచ్చి పంపిస్తున్నారు.

వాళ్ళింటి వీధి అరుగు గదిలో పెట్టిన యర్రమిల్లి పెదెంకట్రాజు బట్టలవ్యాపారం సరిగ్గా జరగడం లేదీ మధ్య. బాకీలు అసలు వసూలవ్వడంలేదు.

వెంకట్రాజుగారి పెద్దబ్బాయి పిలిస్తే వచ్చిన ఏసుపాదం కొట్టు మధ్యలో కూర్చుని ప్రార్థన చేశాడు.

వారం తర్వాత ఇక రాదనుకున్న పారు బాకీ ఒకటి వెంటనే వచ్చింది.

పట్టాభిరామయ్యగారబ్బాయి చిన్నాకి ఎల్లుండు పెళ్ళనగా విరోచనాలు పట్టుకుని రాంపురం ఆస్పత్రిలో చేర్చారు. ఒక పక్కనించి సిలైన్‌లు ఎక్కుతున్నా విరోచనాలు తగ్గకపోయేసరికి ఏసుపాదాన్ని తీసుకొచ్చారు. ప్రార్థించిన మంచినూనె ఇచ్చాడు... దాంతో మర్దనా చేసేసరికి విరోచనాలు కట్టడి పోయినియ్యి.

దాంతో పాస్టర్ ఏసుపాదం అంటే నమ్మకం ఏర్పడింది ఊరి జనాల్లో. రోజూ ఎవరో ఒకళ్ళు వాళ్ళింటికి పిల్చి ప్రార్థన చెయ్యమంటున్నారు. పూటకి ఒకరింట్లో భోజనం రాజాలాగా వెళ్ళిపోతుంది ఏసుపాదం జీవితం.

బండిరేవు గట్టు దగ్గర ఆదిరెడ్డిగారి ఖాళీస్థలం చిన్న ముక్క ఉంటే చర్చిపాక వేసుకోడానికిచ్చేరు ఏసుపాదానికి. పునాదులేపి ఒంటి ఇటిక గోడ కట్టించుకోడానికి చిన్నం వాళ్ళింట్లో తాపీమేస్త్రులతో మాటాడుకున్నాడు. చింతావారితోటలో వెదురుబొంగులూ, వెలగలవాళ్ళపొలంలో తాటాకూ సంపాయించాడు.

వారం పదిరోజులకి ఏసుపాదం చర్చి తయారైంది.

కూటమి పెట్టడానికి ఊళ్ళోవాళ్ళని పిల్చాడు.

ఆరోజు,

ఊరిజనంతో ఏసుపాదం చర్చి కిటకిటలాడిపోతుంది. స్కూలు మేష్టర్లాగ ఒక టేబులేసుకున్న ఏసుపాదం నిలబడి ప్రార్థనలూ, భజన్లూ అయ్యాకా బైబిలులో రాసిన దశమభాగం గురించి చాలా బాగా చెప్పడం మొదలెట్టేడు.

అదేంటంటే,

'రైతుకి వాళ్ళ చేలో పదిబస్తాలు ధాన్యం పండితే ఒక బస్తా, కోడి పదిగుడ్లు పెడితే ఒక గుడ్డు, చర్చికి తీసుకొచ్చి దేవుడికివ్వాలి. అలా పదోభాగం, దేవుడికి సమర్పిస్తే తిరిగి మీకు పదింతలిస్తాడా ప్రభువు ఇది బైబిలులో ఉన్న ఒక సిద్దాంతం'' అంటూ కూటంలో వున్న పసిపిల్లోడు దగ్గర్నుంచి పండు ముసలోడు దాకా అందరికీ అర్థమయ్యేలాగ అరటి పండొలిచినట్టు చెప్పాడు ఆ దశమభాగం గురించి. ఆ తర్వాత ప్రథమఫలం గురించి కూడా చెప్పేడు అదెలాగంటే, మొదటిపంట. మొదటిదూడ, మొదటి సంతానం, మొదటి జీతం ఇలాగ మొట్టమొదటివన్నీ చర్చి కొచ్చి ప్రభువుకి సమర్పించుకోవాలి.

ఇక ఇక్కడ్నుంచి మా ఊళ్ళో కొందరు జనం వాళ్ళ దొడ్లో పాదు పది పొట్లకాయలు కాస్తే ఒక పొట్లకాయ వాళ్ళ కోడిపెట్ట పది కోడిపిల్లల్ని చేస్తే ఒక కోడిపిల్ల ఇలా ఏసుపాదం చర్చికి మోసుకొచ్చేస్తున్నారు.

అవన్నీ మా ఊరికి కాస్త దూరంగా ఉన్న పామర్రు, కూళ్ళలాంటి ఊళ్ళ సంతల్లో అమ్మేస్తున్నాడు ఏసుపాదం.

కోరిశేషయ్యగారి కోడలు నిండు గర్భిణిని తీసుకొచ్చి ప్రసవం సుఖంగా అవ్వాలని ప్రార్థన చెయ్యండి అంది వెంపర్తమ్మ. ఎల్లుండి పిండికొట్టు పెడుతున్నాను. ఇది లాభసాటి వ్యాపారం అవ్వాలని ప్రార్థన చెయ్యండి అనొచ్చాడు తాడిగన్రెడ్డి. ఇలా ప్రార్థనలు చెయ్యమని ఏరోజుకారోజు ఎవరో ఒకరు వస్తానే ఉన్నారు.

ఇక ఆదివారం పూట చూడాలి ఆ చర్చి దగ్గర. ఒకటే జనం.

అలాగ పాస్టర్ ఏసుపాదం అతని చర్చి బాగా పేరెల్లిపోతున్నారు.

పెళ్ళిళ్ళకీ పేరంటాలకీ ఏసుపాదాన్ని పిలుస్తున్నారు. కొందరయితే ఆయనొచ్చేక చేద్దాం శుభకార్యం అనాగుతున్నారు కూడా.

* * *

మల్లిడి ఆదిరెడ్డిగారు, చింతాసుబ్బారాయుడుగారిలాంటి పెద్దవాళ్ళు పిలిస్తే తప్ప చిన్న చిన్న వాళ్ళెవరిళ్ళకీ వెళ్ళడం లేదిప్పుడు.

ఒకరోజు కర్రెంకయ్యగారింట్లో శుభకార్యానికి వెళ్ళి వస్తుంటే చేతిలో చిన్న గొడుగు పట్టుకుని తలొంచుకుని వెళ్ళిపోతున్న ఒక ఆడమనిషి కనిపించింది. మామూలు ఆడాళ్ళలా గాకండా ఎత్తుగా ఉంది. నడక పర్లేదు. మనిషీ పర్లేదు.

వాకబుచేస్తే పేరు కృపామణి అని తెల్సింది. రామచంద్రపురం చర్చి వెనక ఉండే దైవాలు మేష్టారికూతురంట. బాగా చదువుకుందట.

తెలుగుకంటే ఇంగ్లీషు బాగా వచ్చుట. ఏడాకుల వెంకట్రావుగారు కొత్తగా పెట్టిన కాన్వెంటులో టీచరుగా పని చేస్తుందట.

సాయంత్రం రామచంద్రపురంలో ఉన్న దైవాలుమేష్టారింటికెళ్ళి తన వివరాలూ రాబడీ చెప్పి "మీ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను ఏవంటారు?" అన్నాడు.

"మా అమ్మాయి పెద్ద అందంగా ఉండదు. ఎన్ని సంబంధాలొచ్చినా పెళ్ళి సెటిలవలేదు. మరి మా కృపామణిలో ఏం చూసి పెళ్ళి చేసుకుంటానంటున్నారు?" అనడిగాడు దైవాలుమేష్టారు.

"బాగా అడిగారు...మీ అమ్మాయికి మంచి చదువుందికదా మేష్టరుగారు?"

"గుంటూరులో ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదుకుంది".

"ఏమాత్రం చదుకోని నేను చదువుకున్న భార్యని చేసుకోవాలనుకుంటున్నాను చిన్నప్పట్నుంచీ ఇది నాకోరిక... అందుకే మీ అమ్మాయిని చేసుకోవాలనుకుంటున్నాను..అర్థమైందాండీ?"

ఉబ్బితబ్బిబ్బయిపోయిన దైవాలు మేష్టారు. వెంటనే ఒప్పేసుకున్నారు పెళ్ళికి.

ఒక ఆదివారం పూట రామచంద్రపురం చర్చిలో వాళ్ళిద్దరి పెళ్ళయిపోయింది.

ప్రభువుని నమ్ముకుని వస్తున్న భక్తుల రద్దీ మరీ ఎక్కువవ్వడంతో గవళ్ళపేటలో ఇంకో చర్చికట్టి భార్యని అక్కడికి పంపించడం మొదలెట్టిన ఏసుపాదం రాత్రుళ్ళు కష్టపడి ఆమె దగ్గర ఇంగ్లీషు నేర్చుకోడం మొదలెట్టాడు.

రాంపురంలో చర్చి వెనకున్న క్రిష్టియన్ కాంపౌండ్‌లో మేడ, పాత మారిస్‌మైనర్ కారుకూడా కొనుక్కున్నాడు.

వేరే దేశాల్నుంచి డబ్బొస్తుందట ఏసుపాదానికి ఎలాగొస్తుందో అనుకుంటున్నాం.

ఓరోజు మా ఊరికీ రాంపురానికీ మధ్యనున్న లెప్రసీ మిషన్‌లోకెళ్ళిన ఏసుపాదం, అక్కడ ముక్కులూ, ముంజేతులు పోయిఉన్న లెప్రసీ పేషెంట్ల మధ్య కూర్చుని భోం చేస్తా ఫొటోలు తీయించుకున్నాడు.

అదిచూసి వాంతి చేసుకున్న మేం "ఎందుకా?" అనుకున్నాం.

ఊళ్ళో చింతాలమ్మగుడి పక్కనుండే నల్లమిల్లి భాస్కర్రెడ్డిగారు మేడ కట్టుకుని "ఇళ్ళల్లో దిగుతున్నాం భోజనానికి రండి" అని అందరితో పాటు ఏసుపాదాన్ని కూడా పిలిచేడు.

చాలా లేటుగా వచ్చేడు.

అప్పటికి పెద్దోళ్ళంతా భోంచేసేసి వెళ్ళిపోయేరు. బీదోళ్ళు, అడుక్కునేవాళ్ళ బంతి జరుగుతుంది.

కూడా తెచ్చిన కెమెరాతో వాళ్ళ ఫొటోలు చాలా తీసేడు.

"ఎందుకా" అనుకున్నాం మేం. రాంపురంలో వాసుదేవాఫొటోస్టూడియో భూషణంగారితో కుష్టువాళ్ళవీ, బీదోళ్ళు, అడుక్కునేవాళ్ళవీ పెద్ద ఫొటో ప్రింట్లు వేయించేడు.

ఇటలీలో జీన్‌పాల్ బెల్‌మొండో అని ఒక కోటీశ్వరుడున్నాడట. అతను ఏసుప్రభువు భక్తుడు. ఆయన అడ్రసు దయానందరావు దగ్గరున్నప్పుడు సంపాయించేడు. ఈ నెలలో ఇంతమంది బీదలకి భోజనం పెట్టాం ఆ పెట్టడానికి ఇంత కష్టపడ్డాం అనేసి భార్య దగ్గర

నేర్చుకున్న ఇంగ్లీషులో నైసుగా చాలా పెద్దసైజు ఉత్తరం రాసేడు. పోలెండులో గ్రేజీనా జాప్లోస్కా అనే ఒక కోటీశ్వరరాలు కేవలం కుష్టురోగులకి మాత్రమే సాయం చేస్తుందట. ఈ అడ్రసుకూడా దయానందరావు దగ్గరున్నప్పుడు లాగేడు. భార్య తనూ ఊకుమ్మడిగా ఆయనకో పెద్ద ఉత్తరం రాసి ఫొటోల్తో పాటు పోస్ట్ చేసేరు.

రెండు మూడు నెలలకి బెల్మెండో దగ్గర్నించీ, పోలెండ్లో జాప్లోస్కా  దగ్గర్నుంచీ యూరోలరూపంలో చాలా పెద్దమొత్తం కరెన్సీ వచ్చింది ఏసుపాదానికి.

ఇలాగ రోజురోజుకీ పెరిగిపోతున్నాడు ఏసుపాదం. అలాగ దొరల దగ్గర్నుంచి డబ్బులు బాగా గిల్లుకుంటున్న విషయం తెల్సునోళ్ళెవళ్ళో ఆళ్ళకి ఉత్తరాలు రాసేరు. దాంతో ఆ దొరల తాలూకోళ్ళు ఇండియా వచ్చినప్పుడు మా ఊరుకూడా వచ్చి మీటింగ్ పెట్టేరు. మీటింగ్లో మాటాడ్డానికి దొరలకి తెలుగు రాదుగాబట్టి ట్రాన్సలేటర్ని పెట్టమంటే నేను బ్రెహ్మాండంగా ట్రాన్సలేషను చెయ్యగల్నన్నాడు ఏసుపాదం.

ఉపన్యాసం మొదలైంది.

దొరలు ఇంగ్లీషులో అంటుంటే కొంత అర్థవయ్యి కొంత అవ్వని ఏసుపాదం అనువాదం చేసుకుంటా పోతున్నాడు. అతన్లో గొప్పదనమేంటంటే వాళ్ళ ఇంగ్లీషులో అన్నది తెలుగులో అంటున్నప్పుడు ఎలాంటి పొల్లులేకుండా మాటాడ్డం.

'మేం పంపించే డబ్బు ఈ ఏసుపాదం మీకందరికీ పంచుతున్నాడా... ఎంతమందికి అందుతున్నాయో చేతులెత్తండి'' అన్నారు దొరలు.

ఆ ముక్క బాగా అర్థవయిన ఏసుపాదం ''ఈ మీటింగ్ అయ్యేకా దొరలు మీకు కోడిపలావు పొట్లాలు పంచి పెడతాం అంటున్నారు ఎంతమందికి కావాలో చేతులెత్తండి'' అని అనువాదం చేసేసరికి జనాలంతా రెండు చేతులూ ఎత్తడమే గాకుండా పరమానందంగా అరుస్తా డేన్సులు కూడా చేసేరు.

అదిచూసి బోల్డు సంబరపడిపోయిన దొరలు వాళ్ళ దేశం వెళ్ళేక ఇంతకుముందు పంపినదాని కంటే ఇంకా ఎన్నోరెట్లు డబ్బు పంపించడం మొదలెట్టేరు పాస్టరు ఏసుపాదానికి.

* * *